క్లుప్తంగా

కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన



వెల్దుర్తిపాడు(పెనుగంచిప్రోలు):గ్రామంలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.5లక్షలతో నిర్మించనున్న కల్వర్టుకు సర్పంచ్ నక్కా కమల బుధవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పొన్నం కోటేశ్వరరావు, నాయకులు పొన్నం శివాజీ, బాలాజీ, జీతం వెంకయ్య, వేలాద్రి, నక్కా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మాజీమంత్రి పెద్దిరెడ్డిని కలిసిన బత్తుల



పెనుగంచిప్రోలు:మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో వైఎస్సార్‌సీపీ బీసీసెల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి, మైనింగ్ కార్పొరేషన్ మాజీ డైరక్టర్ బత్తుల రామారావు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా పెద్దిరెడ్డి పలు సలహాలు, సూచనలు చేసినట్లు రామారావు వివరించారు.

పన్నులను సకాలంలో చెల్లించాలి : కమిషనర్

నందిగామటౌన్(నందిగామ రూరల్): పట్టణంలో ఇంటి, నీటి, ఖాళీ స్థలం పన్నులు, వ్యాపార లైసెన్స్‌లు, ప్రకటన చార్జీల పన్నులను వెంటనే చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ రమణబాబు బుధవారం కోరారు. ఆస్తిపన్ను డిమాండ్ రూ.5.56 కోట్లకుగాను ఇప్పటివరకు రూ. 2.70 కోట్లు వసూలయ్యాయన్నారు. ఖాళీ స్థలం పన్ను డిమాండ్ రూ.73 లక్షలుండగా ఇప్పటివరకు రూ. 12లక్షలు వసూలయ్యాయని, నీటిపన్ను డిమాండ్ రూ. 2.26 కోట్లు ఉండగా ఇప్పటివరకు రూ.39లక్షలు వసూలైనట్లు వివరించారు. బకాయిదారులు వెంటనే పన్నులను చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు.

విద్యార్థిని నాగినికి సత్కారం



ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): మండలంలోని ముండ్లపాడు గ్రామానికి చెందిన కూచి మోహనరావు, కృష్ణవేణి కుమార్తె నాగిని మంగళవారం విడుదలైన సీఏ ఇంటర్ ఫలితాల్లో అత్యంత విశేష ప్రతిభచూపి అఖిల భారతస్థాయిలో 45వ ర్యాంక్ సాధించింది. ఈసందర్భంగా ప్యారామౌంట్ సంస్థల అధినేత వెనిగళ్ల సురేష్, పారిశ్రామికవేత్త ప్రీతమ్ బుధవారం నాగినిని ఘనంగా సత్కరించారు. నాగినికి గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గూడపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



నందిగామ టౌన్(నందిగామ రూరల్):మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే చర్యలు తప్పవని ట్రాఫిక్ ఎస్‌ఐ నరేష్ హెచ్చరించారు. స్థానిక మధిర రోడ్డులో ర్యాష్ డ్రైవ్ చేస్తున్న యువకులకు బుధవారం ఆయన ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ నరేష్ మాట్లాడుతూ మైనర్‌లు వాహనాలు నడపటం చట్ట విరుద్ధమన్నారు. ద్విచక్రవాహనంపై ముగ్గురు, నలుగురు యువకులు ఎలా వెళ్తారని ప్రశ్నించారు. ఇలాంటి ప్రయాణాలు ప్రమాదకరమని వారిని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని పలువురికి జరిమానా విధించారు.

ఒకేషనల్ కోర్సులతో ఉపాధి అవకాశాలు

జగ్గయ్యపేటఅర్బన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మీభార్గవి ఆధ్వర్యంలో స్థానిక వాగ్దేవి మహిళా కళాశాలలో బుధవారం మహిళలకు ఒకేషనల్ కోర్సులపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా స్కిల్ ట్రైనింగ్ ఒకేషనల్ కోర్సుల గురించి కళాశాల ప్రిన్సిపాల్ బి.సురేష్, అంగన్‌వాడీ టీచర్లు వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కె.ఉషారాణి, షేక్ జానీబీ, సువర్ణ శారద పాల్గొన్నారు.

నేడు సమన్వయ సమావేశం

పెనుగంచిప్రోలు:ఈనెల 14నుంచి నిర్వహించనున్న శ్రీతిరుపతమ్మవారి చిన్నతిరునాళ్ల ఉత్సవాలకు సంబంధించి గురువారం మధ్యాహ్నం గం.3.30 నిముషాలకు వివిధశాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ కిషోర్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్డీవో కె.బాలకృష్ణ అధ్యక్షతన జరిగే ఈసమావేశానికి ఆయాశాఖల అధికారులు తప్పక హాజరు కావాలని ఈఓ కోరారు.

నీరసిస్తున్న తల్లులు

- పనిచేయని పోషన్ ట్రాకర్ యాప్
- అంగన్‌వాడీ కేంద్రాల్లో వేచి ఉండలేక అవస్థల్లో గర్భిణులు, బాలింతలు
- చిన్నారులకు తప్పని ఇబ్బందులు



నందిగామలో పోషన్ ట్రాకర్ యాప్‌లో వివరాలను అప్‌లోడ్ చేసేందుకు యత్నిస్తున్న అంగనవాడీ కార్యకర్త

నందిగామరూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారం తీసుకునేందుకు వచ్చే గర్భిణులు, బాలింతల సహనానికి 'పోషన్ ట్రాకర్' యాప్ పరీక్ష పెడుతోంది. ఐదురోజులుగా ఈ యాప్ సరిగా పనిచేయకపోతుండటంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార పంపిణీ సజావుగా సాగడం లేదు. దీంతో పౌష్టికాహారం కోసం ఆయా కేంద్రాలవచ్చే గర్భిణులు, బాలింతలు గంటల తరబడి వేచి ఉండలేక నీరసించిపోతున్నారు. చంటి బిడ్డలతో మండుటెండలో వేచి ఉండాలంటే ప్రాణాలు పైనే పోతున్నాయని, పౌష్టికాహారం సంగతెలా ఉన్నా ఒంట్లో శక్తి నశించిపోతోందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అంగనవాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందజేసే పోషకాహారం తీసుకునేందుకు వచ్చి అనారోగ్యం బారినపడాల్సి వస్తుందేమోనని ఆందోళన చెందుతున్నారు.

యాప్‌లో నమోదు చేస్తేనే ఆహారం...

ప్రభుత్వం అంగనవాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలతోపాటు చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తుంది. ఆరు నెలల లోపు వయసున్న చిన్నారులకు పాలు, కోడి గుడ్లు అందిస్తుండగా ఆరునెలలకు పైబడిన చిన్నారుల తల్లులకు 24గుడ్లు, 2.50లీటర్ల పాలు, బాలామృతాన్ని నెలలో రెండు దఫాలుగా అందిస్తున్నారు. అయితే ఈ పౌష్టికాహారాన్ని అందించే సమయంలో రికార్డులో లబ్ధిదారునికి సంబంధించిన పలు వివరాలు నమోదు చేయడంతోపాటు ప్రభుత్వం అందించిన పోషన్ ట్రాక్టర్, ఎఫ్‌ఆర్‌ఆర్ యాప్‌లలో సైతం అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

ఉక్కపోతతో తల్లడిల్లుతున్న చిన్నారులు..

అంగన్‌వాడీ కేంద్రాల వద్ద కనీసం నీడ, సరిపడ తాగునీరు, కూర్చునేందుకు వసతులు కూడా లేకపోవడంతో ఇబ్బందికరంగా ఉంటుందని బాలింతలు చెబుతున్నారు. ఐదురోజులుగా అంగనవాడీ కేంద్రానికి రావటం యాప్ పనిచేయడం లేదని తిరిగి వెళ్తున్నామని, అసలే ఎండ వేడిమి అధికంగా ఉండటంతోపాటు భరించలేని ఉక్కపోతతో చంటి బిడ్డలు తల్లడిల్లుతున్నారని బాలింతలు చెబుతున్నారు. ఎన్ని రోజులు పడుతుందో అర్థంకాని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి పోషన్ ట్రాకర్ యాప్ సజావుగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని గర్భిణీలు, బాలింతలు కోరుతున్నారు.

మొరాయిస్తున్న పోషన్ ట్రాకర్ యాప్..



ప్రభుత్వం అందించిన పోషన్ ట్రాకర్ యాప్ రోజుల తరబడి మొరాయిస్తోంది. ఈ యాప్‌లో ప్రభుత్వం అంగనవాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారం తీసుకునే చిన్నారుల తల్లి, తండ్రి, సంరక్షకుడు ఎవరో ఒకరి ఆధార్ కార్డు వివరాలు, ఫేస్ రీడింగ్, పౌష్టికాహారం ఇస్తున్న రోజుల వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. గడిచిన ఐదురోజులుగా యాప్ పనిచేయకపోవడంతో వివరాలు నమోదు చేసేందుకు అంగనవాడీలు ఇబ్బందులు పడుతున్నారు. యాప్‌లో సగం వివరాలు నమోదు చేయగానే ఎర్రర్ అంటూ మరలా నమోదు చేయమని చూపుతోంది. ఒకొక్కరి వివరాలు నమోదు చేసేందుకు గంటల తరబడి సమయం తీసుకుంటుండటంతో అంగన్‌వాడీలు, గర్భిణులు, బాలింతలకు అవస్థలు తప్పడం లేదు.

పడిగాపులు కాస్తున్నాం..



పోషకాహారం తీసుకుని వివరాలు నమోదు చేసే పోషన్ ట్రాకర్ యాప్ మొరాయిస్తుండటంతో గంటల తరబడి వేచి ఉండలేక ఇబ్బంది పడుతున్నాం. చంటి బిడ్డలతో అంగన్‌వాడీ కేంద్రం వద్దనే పడిగాపులు కాస్తున్నాం. కనీస వసతులు కూడా లేవు. ప్రభుత్వం, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

–అఖిల, నందిగామ

ఎన్ని రోజులు పడుతుందో..



యాప్‌లో వివరాలు నమోదు చేయించుకునేందుకు అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్నాం, సగం వివరాలు నమోదు చేయగానే ఎర్రర్ అని వస్తోంది. ఐదు రోజులుగా ఇదే పరిస్థితి. ఎన్ని రోజులు పడుతుందో అర్థం కావడం లేదు. ప్రభుత్వం, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

–భార్గవి, నందిగామ

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..



పోషన్ ట్రాకర్ యాప్ మొరాయిస్తున్న విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. యాప్‌ను ఎలా వినియోగించాలో వీడియో రికార్డింగ్ చేసి పంపారు. ఆ వీడియోను అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాం. అయినా యాప్ పనిచేయడం లేదని చెబుతున్నారు. సమస్యను మరోసారి అధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– కృష్ణకుమారి, ఇన్‌చార్జ్ సీడీపీఓ

పెన్షన్ కోసం లైఫ్ సర్టిఫికెట్లు తప్పనిసరి



కంచికచర్ల : పెన్షన్‌దారులంతా లైఫ్ సర్టిఫికెట్లను సకాలంలో అందజేయాలని కంచికచర్ల ఉప ఖజానాశాఖ కార్యాలయ అధికారి ఎం.కృష్ణారావు సూచించారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయంలో బుధవారం రిటైర్డ్ ఎంప్లాయిస్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కృష్ణారావు మాట్లాడుతూ సబ్ ట్రెజరీ కార్యాలయం నుంచి పెన్షనర్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పెన్షనర్లు డిజిటల్ పద్ధతిలో లైఫ్ సర్టిఫికెట్లను సమర్పించే ప్రక్రియ గతనెల 28వతేదీతో ముగిసిందన్నారు. ఏకారణం చేతనైనా లైఫ్ సర్టిఫికెట్ ఇవ్వలేకపోయినవారు వెంటనే గజిటెడ్ అధికారి సంతకంతో కూడిన ఫారంను తమ కార్యాలయంలో నేరుగా అందజేయాలని సూచించారు. ఈనెలలో కూడా లైఫ్ సర్టిఫికెట్ సమర్పించని పెన్షనర్లకు నిబంధనలకు అనుగుణంగా పెన్షన్ నిలిపివేస్తామని తెలిపారు. ఈ విషయాన్ని పెన్షన్‌దారులంతా గమనించి, లైఫ్ సర్టిఫికెట్లను అందజేయాలని కోరారు. సమావేశంలో సంఘ అధ్యక్షుడు సానె రామ్మోహనరావు, కార్యదర్శి ముండ్లపాటి పోతరాజు, ట్రెజరర్ సీహెచ్ నాగేశ్వరరావు, పెద్దినీడి కోటేశ్వరరావు, చాపలమడుగు స్వర్ణలత, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు అల్పాహారం పంపిణీ

నందిగామటౌన్(నందిగామ రూరల్): తాళ్లూరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలోని రోగులకు అల్పాహారం పంపిణీ చేస్తున్నట్లు ట్రస్ట్ ప్రతినిధి తాళ్లూరి అరుణ తెలిపారు. ఆస్పత్రిలోని అన్ని విభాగాల రోగులకు ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ నాగేశ్వరరావుతో కలిసి బుధవారం ఆమె అల్పాహారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ట్రస్ట్ ద్వారా 40రోజులపాటు 50 మంది రోగులకు అల్పాహారం పంపిణీ చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ సత్యనారాయణ, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఎమ్మెల్సీ పరామర్శ



సుబ్రహ్మణ్యం మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్

నందిగామటౌన్(నందిగామరూరల్): పట్టణానికి చెందిన ప్రైవేట్ పాఠశాలల సీనియర్ ఉపాధ్యాయుడు ఆదిరాజు సుబ్రహ్మణ్యం(70) బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ సుబ్రహ్మణ్యం మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా అరుణకుమార్ మాట్లాడుతూ సుబ్రహ్మణ్యం మృతి బాధాకరమన్నారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సుబ్రహ్మణ్యంకు నివాళులర్పించినవారిలో నాయకులు ములకలపల్లి కృష్ణమోహన్, ఉలవలపూడి నరేంద్ర ఉన్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలి

జగ్గయ్యపేట: రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయశాఖ ఏడీఏ భవాని సూచించారు. మండలంలోని బలుసుపాడు, బూదవాడ గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో వరిపంటను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి పంటలో చీడపీడల నివారణ, ఎరువుల యాజమాన్యంపై రైతులు వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. ముఖ్యంగా రైతులు భూ పరీక్షలు చేసుకుని పంటసాగు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో వరలక్ష్మి, పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

అలసత్వం వహిస్తే చర్యలు



నందిగామ రూరల్: విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని డీఎల్‌పీఓ రాఘవన్ హెచ్చరించారు. మండలంలోని అంబారుపేట గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్ల వెంబడి చెత్తాచెదారాలుంటే సహించేది లేదన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, చెత్త నుంచి సంపద తయారీ కేంద్ర అభివృద్ధికి కృషి చేయాలని కార్యదర్శి రవికుమార్‌కు సూచించారు. ఈవోపీఆర్డీ పద్మజ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

కంచికచర్ల : మద్యంలో పురుగుమందు కలుపుకుని తాగి, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి బుధవారం మృతిచెందారు. ఎస్‌ఐ రాజు కథనం మేరకు.. కంచికచర్ల జుజ్జూరు రోడ్డులో నివాసముంటున్న వీరబాబు(28) కూలి పనులు చేస్తూ జీవనం చేస్తుంటాడు. గతనెల 25వ తేదీన మద్యంమత్తులో అతను మద్యంలో పురుగుమందు కలుపుకుని తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు అతన్ని చికిత్స నిమిత్తం స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ్నుంచి మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతునికి భార్య ఉంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

'మిక్'లో రక్తదాన శిబిరం



కంచికచర్ల : స్థానిక మిక్ ఇంజినీరింగ్ కాలేజీలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో విజయవాడకు చెందిన ఆంధ్రా బ్లడ్‌బ్యాంకు, అమెరికన్ క్యాన్సర్ కేర్ బ్లడ్‌బ్యాంకు సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈశిబిరంలో 126మంది విద్యార్థులు పాల్గొని రక్తదానం చేశారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.వంశీకిరణ్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సీఈఓ డి.పాండురంగారావు, మేనేజ్‌మెంట్ సభ్యులు డాక్టర్ ఎం.సుహాస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ అధికారి డాక్టర్ జి.రాజేష్, ఆంధ్ర ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ కామినేని అచ్యుతబాబు, అమెరికన్ క్యాన్సర్ కేర్ ఆసుపత్రి మేనేజర్ మురళీమోహనరావు, పీఆర్‌ఓ శంకరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చెవిటికల్లు(కంచికచర్ల):రానున్న వేసవికాలంలో గ్రామంలోని ప్రజలతోపాటు ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని ఈఓపీఆర్డీ బొజ్జగాని శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని చెవిటికల్లు ప్రధాన కూడలి వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు.సర్పంచి బుడ్డి విజయలక్ష్మి, కార్యదర్శి ఇందుపల్లి నానిబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రూ.4.60 లక్షల ఆదాయం

పెనుగంచిప్రోలు: స్థానిక తిరుపతమ్మవారి ఆలయంలో భక్తులు సమర్పించే పాలు, పప్పులు, బియ్యం, వగైరాలు ఏడాదిపాటు వసూలు చేసుకునే హక్కునకు బుధవారం నిర్వహించిన బహిరంగ వేలం ద్వారా ఆలయానికి రూ.4.60 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈవో కిషోర్‌కుమార్ తెలిపారు. ఆలయ ఆవరణలో నిర్వహించిన బహిరంగ వేలంలో ఓర్సు గోపయ్య హెచ్చు పాటదారునిగా నిలిచి హక్కును పొందారన్నారు. కార్యక్రమంలో షేర్‌మహ్మద్‌పేట గ్రూపు ఆలయాల ఈఓ ఎ. వైష్ణవి, ఏఈఓలు ఉమాపతి, తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

ఓ వ్యక్తి ఆత్మహత్య

నందిగామటౌన్(నందిగామరూరల్): ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం రాత్రి నందిగామలో చోటుచేసుకుంది. సేకరించిన సమాచారం మేరకు పట్టణంలోని చందామామపేటకు చెందిన క్రాంతి (37) ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ అభిమన్యు ఘటనా స్థలానికి వెళ్లి ఆత్మహత్యకు వివరాలను సేకరించారు. ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



పెనుగంచిప్రోలు: గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం ఈసీసీడే కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సువర్చల, రాజేశ్వరి, వాణి సూచించారు. కొణకంచిలో ఆయుర్వేద వైద్యాధికారి కె.వాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నందిగామ మండలంలో..

నందిగామరూరల్: కేతవీరునిపాడు, మాగల్లు, లింగాలపాడుతోపాటు నందిగామ సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో 'హ్యాపీ ఉమెన్-హెల్దీ ఉమెన్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జి సీడీపీవో కృష్ణకుమారి, సూపర్‌వైజర్లు కరుణకుమారి, వెంకట్రావమ్మ, తారాబి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కంచికచర్ల మండలంలో..

కంచికచర్ల: పెండ్యాల, మోగులూరు, మున్నలూరు అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్ షేక్ కరీమాబీ ప్రసంగించారు. అంగన్‌వాడీలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

పీవీ సునీల్‌పై సస్పెన్షన్ ఎత్తివేతకు డిమాండ్

నందిగామటౌన్(నందిగామ రూరల్): కూటమి ప్రభుత్వం ఎస్సీ ఉద్యోగులపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బంది పెడుతోందని బుధవారం దళిత విశ్రాంత ఉద్యోగ సంఘ నియోజకవర్గ నాయకులు పిల్లి జయరాజు, ఎంవై దాసు, పెసరమల్లి శేఖర్‌రావు, సుభాని, మోక్షానందం, విజయ్, జీవరత్నం అన్నారు. దళిత ఉద్యోగులకు పోస్టింగ్‌లు ఇవ్వకుండా కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. పీవీ సునీల్‌కుమార్‌ను సస్పెండ్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. దళిత సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్‌పై ఉన్న సస్పెన్షన్‌ను ఎత్తివేయడంతోపాటు తక్షణమే పోస్టింగ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా దళితులు పోరాడేందుకు సిద్ధంగా ఉన్నారని వారు స్పష్టం చేశారు.

నేడు మద్యం దుకాణాల కేటాయింపు

నందిగామటౌన్(నందిగామ రూరల్)/వీరులపాడు: ప్రభుత్వం గీత కులాలకు ప్రత్యేకంగా కేటాయించిన మద్యం దుకాణాల కేటాయింపు కోసం గొల్లపూడిలోని బీసీ సంక్షేమ భవన్‌లో గురువారం ఉదయం పదిగంటలకు లాటరీ ప్రక్రియను నిర్వహిస్తున్నట్లు నందిగామ, వీరులపాడు ఎక్సైజ్ సీఐలు బంగార్రాజు, అశ్రఫున్నిసా బేగం బుధవారం తెలిపారు. దరఖాస్తుదారులు తమ ఆధార్, ఎంట్రీపాస్, కుల, నేటివిటీ ధ్రువీకరణ పత్రాలతో ఉదయం తొమ్మిది గంటల్లోగా బీసీ సంక్షేమ భవన్‌కు చేరుకోవాలని వారు సూచించారు.

రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన : తన్నీరు



బూదవాడ నాయకులతో తన్నీరు

జగ్గయ్యపేట: సీఎం చంద్రబాబు ఎన్నికల హామీలను విస్మరించి రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలుచేస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు విమర్శించారు. మండలంలోని బూదవాడ, త్రిపురవరం, రెడ్డినాయక్‌తండ గ్రామాల్లో బుధవారం రాత్రి ఆయన పర్యటించారు. గ్రామ కన్వీనర్లుగా ఎంపికైన వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్‌సిక్స్ హామీలను గాలికొదిలేసి కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు. ప్రజా సమస్యలపై పార్టీ నాయకులు, కార్యకర్తలు పోరాడాలని చెప్పారు. పార్టీ మండల కన్వీనర్ బూడిద నరసింహారావు, జిల్లా కార్యదర్శి చల్లా వైకుంఠరావు, మండలపార్టీ మాజీ అధ్యక్షుడు శ్రీనివాసగౌడ్, గ్రామ కన్వీనర్లు, పరిటాల పెద్దసైదులు, జరుగుల ఆకారి ఆదినారాయణ, బాణావత్‌సైదా పాల్గొన్నారు.

తపోదీక్షలు ప్రారంభం



జగ్గయ్యపేట అర్బన్: క్రైస్తవుల జీవితంలో తపస్సుకాలం ఓ ప్రత్యేక మజిలీ అని స్థానిక తిరుహృదయ ఆర్‌సీఎం చర్చి ఫాదర్ రెవ గుడిసె జయరాజు అన్నారు. స్థానిక తిరుహృదయ ఆర్‌సీఎం చర్చిలో విభూది బుధవారం సందర్భంగా రెవ ఫాదర్ జోజిరెడ్డి దివ్యబలి పూజ నిర్వహించారు. సుమారు 250మంది తపోదీక్ష స్వీకరించారు.

చర్చిలలో ప్రార్థనలు ..

భస్మ బుధవారం పురస్కరించుకుని పోస్టాఫీసు వద్ద ఉన్న సెయింట్ థామస్ సిఎస్‌ఐ టౌన్ చర్చిలో డీసరీ చైర్మన్ సిలారపు పాల్‌రాజు దైవ సందేశం ఇచ్చారు. కోదాడ రోడ్డులోపి బేతెస్థ చర్చి, బలుసుపాడు రోడ్డులోని బేతేలు చర్చి, క్రిస్టియన్‌పేట, విలియంపేటల్లోని సీఎస్‌ఐ, జీజీఎఫ్ మినిస్ట్రీస్ చర్చిలు, ఆటోనగర్ ఆమోద ఇండస్ట్రీస్‌లోని చర్చి, తొర్రగుంటపాలెంలోని సియోను చర్చి, ఆర్టీసీ కాలనీలోని హోసన్నా ప్రార్థనామందిరం, కాకానినగర్‌లోని క్రైస్ట్ చర్చి, షాలేం చర్చిలలో ఆయా పాస్టర్లు, సంఘాల ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు.